తెలంగాణపై జల ఖడ్గం

- కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగిస్తే నష్టం
- సాగుకే కాదు తాగు నీటికి కూడా కటకటే
- కేఆర్ఎంబీ వద్ద అడుక్కుతినే పరిస్థితి
- రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల భవిష్యత్తు ప్రశ్నార్థకం
- కొత్త ప్రాజెక్టు చేపట్టడం అసాధ్యమే
- కరెంటు ఉత్పత్తి విషయంలో స్వయంప్రతిపత్తి కోల్పోతాం
- విద్యుత్తు గ్రిడ్ కుప్పకూలే ప్రమాదం
- రాష్ట్ర ప్రయోజనాలతో రాజకీయాలా?
- ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తే ఊరుకునే ప్రసక్తేలేదు
- జాతీయ హోదా తెస్తామని ఉన్నవి ఊడగొడ్తరా?
- ప్రాజెక్టులు కట్టి నీళ్లు తెచ్చినం.. వాటిని రైతులకిచ్చేందుకు సమస్యేంది?
- మాజీ మంత్రి హరీశ్‌రావు నిలదీత

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, పార్టీ నేత రావుల చంద్రశేఖర్‌రెడ్డి

నాలుగైదు రోజులుగా జరుగుతున్న పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఉమ్మడి ప్రాజెక్టులను కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందన్న వార్త తెలంగాణవాదులను కలవరపరుస్తున్నది. ఆ వార్తలే నిజమైతే తెలంగాణ అసాధారణ స్థాయిలో నష్టపోతుంది. రాష్ట్రానికి ఇప్పటివరకు విద్యుత్తు విషయంలో ఉన్న స్వయంప్రతిపత్తి తుడిచిపెట్టుకుపోతుంది. -హరీశ్‌రావు

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాలను ఢిల్లీకి తాకట్టు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. నాలుగైదు రోజులుగా జరుగుతున్న పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఉమ్మడి ప్రాజెక్టులను కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కి అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందన్న వార్త తెలంగాణవాదులను కలవరపరుస్తున్నదని అన్నారు. ఆ వార్తలే నిజమైతే తెలంగాణ అసాధారణ స్థాయిలో నష్టపోతుందని, రాష్ట్రానికి ఇప్పటివరకు విద్యుత్తు విషయంలో ఉన్న స్వయంప్రతిపత్తి తుడిచిపెట్టుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయాలు మాని రాష్ట్ర ప్రయోజనాల కోసం అధికార, ప్రతిపక్షాలు కలిసి పనిచేయాలని హితవు పలికారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేసిందని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఉద్యమ ట్యాగ్‌లైన్‌గా నీళ్లు, నిధులు, నియామకాలు అని నిర్ణయించారని.. అందుకు అనుగుణంగానే తాము పనిచేశామని పేర్కొన్నారు. ఉద్యమకారులుగా తెలంగాణ ప్రజల ప్రయోజనాలే తమకు ముఖ్యమని, ఆ తరువాతే రాజకీయాలని తేల్చిచెప్పారు. కృష్ణాజలాల విషయంలో ఆంధ్రప్రదేశ్‌కు లాభం జరిగేలా తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని వచ్చిన మీడియా కథనాలను ఆయన ప్రదర్శించారు. ఢిల్లీలో జరిగిన సమావేశంలో ఉమ్మడి ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించటానికి రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకున్నదని, పర్యవసానంగా ప్రాజెక్టులన్నీ కేఆర్ఎంబీ పరిధిలోకి వెళుతున్నాయని వార్తలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. అదే జరిగితే తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. 'ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించాలని 2015 జూన్ 15న కేంద్రం జారీచేసిన నోటిఫికేషన్‌ను కేసీఆర్ సర్కార్ తీవ్రంగా వ్యతిరేకించింది. అప్పటినుంచి ఇప్పటివరకు జరిగిన ప్రతీ సమావేశంలో కేంద్రం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణపై తీవ్ర ఒత్తిడి పెంచే ప్రయత్నం చేస్తూనే ఉన్నాయి. అయినా ప్రాజెక్టులను ఏకపక్షంగా కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకురావటానికి ఒప్పుకోబోమని తేల్చిచెప్పాం. తెలంగాణ న్యాయబద్ధ హక్కులు దక్కిన తరువాతే ఒప్పుకుంటామని స్పష్టం చేశాం. కేంద్రానికి నాడు కొన్ని ప్రతిపాదనలు చేశాం. వాటికి ఒప్పుకుంటేనే కేఆర్ఎంబీ పరిధిలోకి చేర్చాలా? వద్దా? అని ఆలోచిస్తామని కేసీఆర్ సర్కార్ కుండబద్దలు కొట్టింది' అని హరీశ్‌రావు వివరించారు.

కొత్తవి తెస్తామని వెళ్లి ఉన్నవి ఇచ్చేసి వస్తారా?

ఆంధ్రప్రదేశ్‌కు ప్రయోజనం కలిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రజల హక్కులను కాలరాసేందుకు కేఆర్ఎంబీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలోనే తాము అపెక్స్ కమిటీకి రిఫర్ చేయాలని డిమాండ్ చేశామని హరీశ్‌రావు తెలిపారు. అపెక్స్ కమిటీలో కేంద్ర జల వనరుల శాఖ మంత్రి చైర్మన్‌గా, ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉంటారని చెప్పారు. నదీ జలాల పంపిణీలో ఎదురయ్యే సమస్యలను కేఆర్ఎంబీ, కేంద్ర జలవనరుల శాఖ తేల్చలేనప్పుడు అపెక్స్ కమిటీకి రిఫర్ చేయాలని రాష్ట్ర పునర్విభజన చట్టంలో స్పష్టంగా ఉన్నదని, ఈ నేపథ్యంలో తాము అపెక్స్ కమిటీకి సిఫారసు చేయాలని డిమాండ్ చేశామని పేర్కొన్నారు. జాతీయ ప్రాజెక్టు తెస్తామని ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్, ఉన్న ప్రాజెక్టులను అప్పజెప్పే ప్రయత్నం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రక్షణలు, హక్కులను చూసుకోకుండా ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం ఎట్లా ఒప్పుకున్నదని ప్రశ్నించారు. వారం రోజుల్లోనే మీడియాలో కథనాలు వస్తున్నా ప్రభుత్వ పెద్దలెవరూ స్పందించకపోవటంతో తాను మాట్లాడాల్సి వస్తుందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను ఢిల్లీలో తాకట్టు పెడితే సహించేది లేదని తేల్చి చెప్పారు.

5 వేల మెగావాట్ల కరెంటు చేజారిపోతుంది

కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించటం వల్ల విద్యుత్తు ఉత్పత్తిలో తెలంగాణ స్వయం ప్రతిపత్తిని కోల్పోతుందని హరీశ్‌రావు హెచ్చరించారు. 900 మెగావాట్ల శ్రీశైలం ఎడమగట్టు, 815 మెగావాట్ల నాగార్జునసాగర్ మెయిన్ పవర్ హౌజ్, నాగార్జునసాగర్ ఎడమకాలువ మీద ఉన్న 60 మెగావాట్ల యూనిట్లు కలిపి 1,775 మెగావాట్ల విద్యుత్తు కేంద్రం చేతుల్లోకి వెళ్తుందని తెలిపారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవటం లేదని ఆరోపించారు. గత తొమ్మిదిన్నరేండ్లుగా అటు జల విద్యుత్తు, ఇటు థర్మల్ విద్యుత్తును బ్యాలెన్స్ చేస్తూ గ్రిడ్ కుప్పకూలకుండా కాపాడామని, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నిర్వాకం వల్ల ఆ ప్రమాదం పొంచి ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రంలోని జల విద్యుత్తు స్టేషన్ల నుంచి సగటున 5000 మిలియన్ యూనిట్ల విద్యుత్తును తీసుకున్నామని చెప్పారు. జల విద్యుత్తు యూనిట్‌కు రూ.2.50 అయితే, థర్మల్ విద్యుత్తుకు రూ.5.50 అవుతుందని, చౌకగా లభించే హైడల్ పవర్‌ను వదిలి థర్మల్ పవర్ వైపు వెళ్లటం వల్ల రాష్ట్రానికి నష్టం వాటిల్లుతుందని తెలిపారు. టేల్ పాండ్‌లో నాన్‌పీక్ అవర్స్‌లో కరెంట్ ఎక్కువైనా, తక్కువైనా గ్రిడ్ కుప్పకూలుతుందని, రివర్స్ పంప్ చేసి టేల్‌పాండ్ నడపాలన్నా కేంద్రానికి దరఖాస్తులు పెట్టుకోవాల్సి వస్తుందని అన్నారు. టేల్‌పాండ్ ద్వారా కేసీఆర్ సర్కార్ గత పదేండ్లలో రివర్స్ పంపింగ్ ద్వారా 300 టీఎంసీలను వాడుకున్నదని వివరించారు. గ్రిడ్ కుప్పకూలితే రాష్ట్రంలో అప్రకటిత కరెంటు కోతలు తప్పవని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు సమయంలోనే భద్రాచలం డివిజన్‌లోని ఏడు మండలాలను, లోయర్ సీలేరు పవర్ ప్రాజెక్టును ఆంధ్రాకు అప్పగించి తెలంగాణకు ద్రోహం చేసింది బీజేపీ, కాంగ్రెస్‌లేనని హరీశ్‌రావు మండిపడ్డారు. 250 రోజులు విద్యుత్తు ఉత్పత్తి చేసుకునే అవకాశాన్ని తెలంగాణకు రాకుండా రెండు జాతీయ పార్టీలు తీవ్ర అన్యాయం చేశాయని ఆగ్రహం వ్యక్తంచేశారు.

సాగర్ ఆయకట్టుకు తీరని నష్టం

పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుకు శ్రీశైలం ద్వారా ఏపీకి నీళ్లు తీసుకెళ్తారని, బచావత్ ట్రిబ్యునల్‌లో ప్రాజెక్టు వారీగా కేటాయింపులు కాకుండా రాష్ట్రం వారీగా చేయటంతో కృష్ణాడెల్టాకు పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా గోదావరి నీటిని తరలించుకుపోతున్నారని, సాగర్ ఆయకట్టుకు నీళ్లులేకుండా చేసే కుట్రలు సాగుతున్నాయని హరీశ్‌రావు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మేల్కొని రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేశారు. 'ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తే ఖమ్మం, హైదరాబాద్, నల్లగొండ, మహబూబ్‌నగర్‌లో తాగునీటి కష్టాలు మొదలవుతాయి. మిషన్ భగీరథ నీటికి కష్టకాలం దాపురించబోతున్నది. నిర్మాణంలో ఉన్న పాలమూరు, డిండి, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది. కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగిస్తే మనకు మనమే ఉరితాడు బిగించుకున్నట్టు అవుతుంది. కొత్త ప్రాజెక్టుల ఊసేలేకుండా పోతుంది' అని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ అంశాలను రాజకీయ కోణంలో కాకుండా తెలంగాణ ప్రజల విశాల ప్రయోజనాలు, హక్కులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వ్యవహరించాలని సూచించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కండ్లు తెరవాలని కోరారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించకుంటే తాము పోరాటానికి సిద్ధమవుతామని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్‌కు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని, రాజకీయాలు కాదని తేల్చి చెప్పారు.

> జాతీయ ప్రాజెక్టు తెస్తామని ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్ ఉన్న ప్రాజెక్టులను అప్పజెప్పే ప్రయత్నం చేశారు. రక్షణలు, హక్కులను చూసుకోకుండా ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం ఎట్లా ఒప్పుకున్నది? వారం రోజుల్లోనే మీడియాలో కథనాలు వస్తున్నా ప్రభుత్వ పెద్దలెవరూ స్పందించకపోవడంతోనే నేను మాట్లాడాల్సి వస్తున్నది. రాష్ట్ర ప్రయోజనాలను ఢిల్లీలో తాకట్టు పెడితే సహించేది లేదు.
> -హరీశ్‌రావు

> ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తే ఖమ్మం, హైదరాబాద్, నల్లగొండ, మహబూబ్‌నగర్‌లో తాగునీటి కష్టాలు మొదలవుతాయి. మిషన్ భగీరథ నీటికి కష్టకాలం దాపురించబోతున్నది. నిర్మాణంలో ఉన్న పాలమూరు, డిండి, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది. కొత్త ప్రాజెక్టుల ఊసేలేకుండా పోతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం కండ్లు తెరవాలి. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించకుంటే మేం పోరాటానికి సిద్ధం.
> -హరీశ్‌రావు

> కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించటం వల్ల విద్యుదుత్పత్తిలో తెలంగాణ స్వయం ప్రతిపత్తిని కోల్పోతుంది. 900 మెగావాట్ల శ్రీశైలం ఎడమగట్టు, 815 మెగావాట్ల నాగార్జునసాగర్ మెయిన్ పవర్‌హౌజ్, నాగార్జునసాగర్ ఎడమకాలువ మీద ఉన్న 60 మెగావాట్ల యూనిట్లు కలిపి 1,775 మెగావాట్ల విద్యుత్తు కేంద్రం చేతుల్లోకి వెళ్తుంది. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. గత తొమ్మిదిన్నరేండ్లుగా అటు జల విద్యుత్తు, ఇటు థర్మల్ విద్యుత్తును బ్యాలెన్స్ చేస్తూ గ్రిడ్ కుప్పకూలకుండా మేం కాపాడాం. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకం వల్ల ఆ ప్రమాదం పొంచి ఉన్నది. -హరీశ్‌రావు

తెలంగాణకు తీరని నష్టం

కృష్ణా నది జలాల్లో తెలంగాణ వాటా తేల్చేందుకు ట్రిబ్యునల్ వేయాలని సుప్రీం కోర్టు గడపతొక్కిన కారణంగానే కేంద్రం దిగివచ్చిందని హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్ పలుమార్లు కేంద్ర జలవనరుల శాఖ మంత్రిని కలిసి ఒప్పించిన తర్వాతే కేంద్రం కొత్త ట్రిబ్యునల్ వేసిందని చెప్పారు. అపరేషన్ మాన్యువల్ లేకుండా ప్రాజెక్టును కేఆర్ఎంబీకి అప్పగిస్తే తెలంగాణ ప్రయోజనాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు.

1. విద్యుత్తు ఉత్పత్తిలో తెలంగాణ స్వయం ప్రతిపత్తిని కోల్పోతుంది. శ్రీశైలం ఎడమ గట్టు కాలువ తెలంగాణ చేతిలో ఉన్నది. దీని వల్ల ఎప్పుడు కావాలంటే అప్పుడు కరెంటు ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉన్నది. కేఆర్ఎంబీ పరిధిలోకి పోతే ఆ అవకాశం ఉండదు.
2. నాగార్జునసాగర్ ఎడమకాలువ కింద తెలంగాణలో దాదాపు 5 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నది. ఇదంతా తీవ్ర ప్రమాదంలో పడుతుంది.
3. హైదరాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ ప్రాంతాలకు తాగునీటికి సమస్య వస్తుంది.
4. నిర్మాణంలో ఉన్న పాలమూరు ఎత్తిపోతల, డిండి ఎత్తిపోతల, ఎస్ఎల్‌బీసీసహా పలు ప్రాజెక్టులపై ప్రభావం పడుతుంది. కేఆర్ఎంబీ చేతికి వెళితే ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి ముందు అనుమతులు తీసుకోవాలి. సీడబ్ల్యూసీ, అపెక్స్ కమిటీ అనుమతులు తీసుకున్న తరువాతే వీటిని కట్టాలని షరతు పెట్టే ప్రమాదం ఉన్నది. దీంతో ఆ ప్రాజెక్టుల ఉనికే ప్రశ్నార్థమవుతుంది.
5. భవిష్యత్తులో కృష్ణానది పరీవాహక ప్రాంతంలో కొత్తగా ఏ ప్రాజెక్టు నిర్మించాలన్నా కేఆర్ఎంబీ అనుమతి తీసుకోవాల్సి వస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే కేఆర్ఎంబీని తెలంగాణ అడుక్కోవాల్సిన దుస్థితి తలెత్తుతుంది.

కేంద్రానికి కేసీఆర్ సర్కారు చేసిన ప్రతిపాదనలు

- ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టులు, ప్రతిపాదిత ప్రాజెక్టులను ఎలా నిర్వహించాలో పక్కాగా తేల్చేందుకు అపరేషనల్ మ్యాన్యువల్స్ ఫైనల్ చేయాలి.
- తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల వాటా ట్రిబ్యునల్‌లో తేలలేదు. అడ్‌హక్ పద్ధతిలో ఒక్క సంవత్సరానికే తేల్చారు. అది పూర్తిగా తేల్చాల్సిందే.
- ట్రిబ్యునల్‌లో కృష్ణాజలాల వాటా స్పష్టంగా తేలేదాకా ఏపీ, తెలంగాణ మధ్య 50% చొప్పున నీటిపై నిర్ణయం తీసుకోవాలి.
- 264 టీఎంసీల నీటిని నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విద్యుత్తు ఉత్పత్తికోసం విడుదల చేయాలని శ్రీశైలం ప్రాజెక్టు మంజూరు సమయంలో ప్రణాళికా సంఘం స్పష్టం చేసింది. దానినీ తేల్చాలి.
- హైదరాబాద్ తాగునీటి అవసరాలు, మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు మిషన్ భగీరథ ద్వారా ప్రస్తుతం నీరు అందుతున్నది. బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం తాగునీటికి వినియోగించే మొత్తం నీటిలో 20 శాతం మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి. మిగిలిన 80 శాతం నీరు పునరుత్పత్తి (రీ-జనరేషన్ వాటర్‌గా తిరిగి వస్తుంది) జరుగుతుంది.
- క్యాలీ ఓవర్ ఫెసిలిటీ కల్పించాలి. తెలంగాణకు కేటాయించిన నీటిని అదే సంవత్సరం కాకుండా వచ్చే సంవత్సరం వాడుకునే అవకాశం ఉండాలి. సకాలంలో వర్షాలు పడకపోతే ఆ నీటిని వాడుకోవచ్చు.
- శ్రీశైలం ప్రాజెక్టులో నీటిమట్టం 830 అడుగులలు మెయింటెయిన్ చేయాలి. అలా చేస్తేనే విద్యుత్తు ఉత్పత్తికి వీలుంటుంది. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు నుంచి ఆంధ్రప్రదేశ్‌కు న్యాయబద్ధంగా వెళ్లేది 34 టీఎంసీలు (ఇందులో చెన్నై తాగునీటి అవసరానికి 15 టీఎంసీలు, ఎస్ఆర్‌బీసీకి 19 టీఎంసీలు) మాత్రమే. ఇంతకన్నా ఎక్కువ వినియోగించుకునే అవకాశం ఇవ్వొద్దు.
- వీటిని అపెక్స్ కమిటీకి సిఫారసు చేయాలి.

మోటర్లను తరుచూ ఆన్ అండ్ ఆఫ్ చేయొద్దు

కాళేశ్వరం సహా ఇతర ఎత్తిపోతల పథకాల్లో మోటర్లను తరుచూ ఆన్ అండ్ ఆఫ్‌లో వాడుతున్నట్టు తమకు సమాచారం ఉన్నదని, పెద్ద పెద్ద మోటర్లను అలా నడపటం వల్ల వాటి సామర్థ్యం, జీవనకాలం దెబ్బతింటదని సాంకేతిక నిపుణులు చెప్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఒక పంప్ హౌజ్‌లో నాలుగు మోటర్లు ఉంటే కరెంట్ తక్కువ ఉన్నప్పుడు రెండు లేదా ఒకటి నడపాలని సూచించారు. అలా కాకుండా మోటర్లను రోజుకు రెండుసార్లు ఆన్ ఆఫ్ చేస్తున్నారని, తద్వారా మోటర్లు రిపేర్లు రావడం, సామర్థం తగ్గిపోయే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. ఈ విషయంలో నిపుణుల సూచనలు తీసుకోవాలని సూచించారు. ఆన్ అండ్ ఆఫ్‌లో నడపటం ద్వారా ఎత్తిపోతల పథకాలే దెబ్బతినే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు.

లోకం పోకడ



రేపటి నుంచి కొమురవెల్లి మల్లన్న జాతర

ఈనెల 21న పట్నం వారం

చేర్యాల, జనవరి 19: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రం వార్షికోత్సవాలకు సిద్ధమైంది. సంక్రాంతి తర్వాత వచ్చే మొదటి ఆదివారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ ఉత్సవాల్లో స్వామి వారి కల్యాణం, పట్నం వారం, లష్కర్ వారం, మహా శివరాత్రి రోజున పెద్ద పట్నం, అగ్నిగుండాలు నిర్వహిస్తారు. ఈనెల 21 పట్నం వారంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. పట్నం వారానికి హైదరాబాద్ నుంచి 50 వేల మంది వస్తారు. హైదరాబాద్ భక్తులు మల్లన్న పేరిట సట్టీ దీక్షలను 41 రోజులపాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించి, పట్నం వారం స్వామి వారిని దర్శించుకున్న అనంతరం దీక్షలను విరమిస్తారు. ఈనెల 22న స్వామి వారి కల్యాణ వేదిక వద్ద పెద్దపట్నం, అగ్నిగుండాలు నిర్వహిస్తాయి.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
రంగారెడ్డి	14.2°c	34.7°c
ఆదిలాబాద్	16.0°c	32.5°c
మెదక్	16.6°c	32.9°c
నల్లగొండ	18.0°c	33.4°c
హైదరాబాద్	18.2°c	30.6°c
వరంగల్	19.0°c	30.0°c
ఖమ్మం	19.0°c	31.0°c
కరీంనగర్	19.0°c	31.0°c
మహబూబ్‌నగర్	19.7°c	32.4°c
నిజామాబాద్	20.0°c	32.6°c

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

నేషనల్ హైవేస్‌లో..

నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 60
- **పోస్టులు:** డిప్యూటీ మేనేజర్
- **అర్హతలు:** సివిల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణత. 30 ఏండ్లు మించరాదు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 15
- **వెబ్‌సైట్:** http://www.nhai.gov.in

అసిస్టెంట్ మేనేజర్లు

ప్రభుత్వ సంస్థ రైట్స్ లిమిటెడ్‌లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 16
- **పోస్టులు:** అసిస్టెంట్ మేనేజర్ (ఫైనాన్స్)
- **అర్హతలు:** సీఏ/కాస్ట్ అకౌంటెంట్, రెండేండ్ల అనుభవం ఉండాలి
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 29
- **వెబ్‌సైట్:** https://www.rites.com

ఎన్‌టీపీసీలో...

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌టీపీసీ)లో మెడికల్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 61
- **పోస్టులు:** జీడీఎంవో, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, రేడియాలజీ తదితరాలు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 24
- **వెబ్‌సైట్:** www.ntpc.co.in

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- ఫిజిక్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, చరిత్ర కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

యాసంగికి నీళ్లెందుకివ్వరు?

- ప్రాజెక్టులు కట్టినం.. నీళ్లు తెచ్చినం..
- రైతులకు ఇవ్వటానికి అభ్యంతరమా?'
- మేడిగడ్డలో ఇప్పటికీ పుష్కలంగా నీళ్లు
- మిడ్‌మానేరు, ఎల్ఎండీకి తెచ్చుకోవచ్చు
- ప్రభుత్వానికి హరీశ్‌రావు సూచన

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ):కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ నుంచి ఇప్పటికీ నీళ్లు తీసుకురావచ్చని, అయినా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవటంలేదని హరీశ్‌రావు విమర్శించారు. మేడిగడ్డ దగ్గర నీళ్లు లేవని, రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని మంత్రులు సూచించటాన్ని ఆయన తప్పుబట్టారు. 'ఎస్ఆర్ఎస్పీలో 4 లక్షల ఎకరాలకు బదులు 2 లక్షల ఎకరాలకే నీళ్లు ఇస్తామని ప్రభుత్వం చెప్తున్నది. మేడిగడ్డ బరాజ్ మరమ్మతు జరుగుతున్నా గోదావరి నదిలో ఇప్పటికీ 4 వేల నుంచి 5 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉన్నది. వీటిని ఇప్పటికీ కూడా ఎత్తిపోసి రైతాంగానికి పూర్తిస్థాయిలో నీరు ఇచ్చే అవకాశం ఉన్నది. మార్చి, ఎప్రిల్‌లో నీళ్లు అందక పంటలు ఎండిపోయి రైతులు ఆందోళన చెందే ప్రమాదం ఉన్నది. మేడిగడ్డ దగ్గర నీటిని లిఫ్ట్ చేసి మిడ్‌మానేరు, ఎల్ఎండీకి నీళ్లు తెచ్చుకోవచ్చు. ఎంతసేపు మాపై బురదజల్లాలని చూడటం కాకుండా ప్రభుత్వం రైతాంగానికి అండగా నిలవాలి. మా మీద జల్లే బురదను ఎదుర్కొంటాం. అంతేకాని ప్రాజెక్టును ఫెయిల్యూర్ కింద చూపొద్దు. అవకాశం ఉన్న నీటిని సముద్రంపాలు చేయకుండా రైతులకు ఇచ్చే ప్రయత్నం చేయాలి. గత మూడేండ్లు మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ నీటిని రైతులకు అందించాం. ఇప్పుడు ఆ రిజర్వాయర్లలో నీళ్లున్నాయి. వాటిని రైతులకు అందివ్వాలి. ప్రాజెక్టులు మేమే కట్టినం.. నీళ్లు మేమే తెచ్చినం.. వాటిని రైతులకు ఇవ్వటానికి అభ్యంతరం ఏమిటి?' అని ప్రశ్నించారు.

కేంద్రానికి ధారాదత్తం

మొదటిపేజీ తరువాయి...

శాఖ తెలిపింది. ఇకపై బోర్డు అనుమతి లేకుండా ఇరు రాష్ట్రాల అధికారులు, ఇంజినీర్లు ఎవరూ సాగర్‌డ్యామ్‌పై అడుగు కూడా పెట్టలేరు. ఇదిలా ఉంటే జల్‌శక్తిశాఖ మినట్స్‌కు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయటం గమనార్హం.

తెలంగాణ నీటి హక్కులకు విఘాతం

శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నిర్వహణ కోసం కేఆర్ఎంబీ ఇప్పటికే రూపొందించిన ఆపరేషనల్ ప్రొటోకాల్ ఏపీకి వత్తాసు పలికేలా ఉన్నదని ఇంజినీర్లు, నీటిరంగ నిపుణులు అంటున్నారు. రివర్ బోర్డ్‌ల అధికార పరిధిని నిర్దేశిస్తూ కేంద్రం విడుదల చేసి గెజిట్ అమలుపై గత ప్రభుత్వం ప్రత్యేకంగా సబ్‌కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్ల ఆపరేషనల్ ప్రొటోకాల్‌ను ఆ కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి అనాడే తీవ్రంగా తప్పుబట్టింది. బచావత్ ట్రిబ్యునల్ అవార్డును, ప్లానింగ్ కమిషన్ నిబంధనల ప్రకారం శ్రీశైలం రిజర్వాయర్ జలవిద్యుత్తు ప్రాజెక్టు మాత్రమేనని స్పష్టం చేసింది. నాగార్జునసాగర్‌కు ప్రత్యేకంగా ఎలాంటి క్యాచ్‌మెంట్ ఏరియా లేదని, శ్రీశైలం రిజర్వాయర్ నుంచి మాత్రమే జల విద్యుత్తు ఉత్పత్తి ద్వారా మాత్రమే సాగర్ రిజర్వాయర్‌కు నీరు అందుతుందని, ఆ అంశాలను ఏవీ పట్టించుకోకుండా కేఆర్ఎంబీ ప్రొటోకాల్ రూపొందించిందని ఆ కమిటీ తప్పుపట్టింది. మిగులు జలాలు, క్యారీ ఓవర్, తాగునీటి వినియోగం తదితర అనేక అంశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఆర్ఎంసీ రూపొందించిన రిపోర్టును అంగీకరించే ప్రసక్తే లేదని గత బీఆర్ఎస్ సర్కారు తేల్చిచెప్పింది. కానీ నేడు ఆయా అంశాలపై ఎలాంటి స్పష్టత రాకుండానే ముందస్తుగా ప్రాజెక్టుల అప్పగింతకు కాంగ్రెస్ అంగీకారం తెలపడం గమనార్హం.

నికరజలాలను కోల్పోవాల్సిన ప్రమాదం

ఆపరేషనల్ ప్రొటోకాల్ ముసాయిదాలో చేసిన ప్రతిపాదనలతో తెలంగాణ 45 టీఎంసీల నికర జలా